మాది ఆశ్రమ పాఠశాల. అందులో ఉన్నవాళ్లం అందరం ఒకే కుటుంబం. రాష్ట్రమంతటికీ మార్కుల్లో మొదటి స్థానాలాక్రమించే మా పిల్లలంటే నా కాపేక్ష ఆత్మీయత. అయిదారేళ్ల నుంచీ ఆ పేరు నిలబెట్టుకుంటున్న మా సంస్థ మీద అపార గౌరవం. మా కున్న విజ్ఞానం పిల్లలికి నూరిపోసేద్దామనే ఆత్రుత. దానికి తగ్గట్టు ఉత్సాహపడే వాళ్లని చూస్తుంటే మాకు ఉద్రేకం వచ్చేస్తుంది. మా విజయాల్ని సాధించుకున్నపుడల్లా మా ఉపాధ్యాయ వృత్తి మీద అనిర్వచనీయమైన అభిమానం, సంతృప్తి.

కొడుకులు గాని కొడుకులు మా విద్యార్థులు.

అలాంటివాళ్లల్లో - ఎల్లన్న ఒకడు.


ఇప్పుడు వాడి కాంపోజిషనే దిద్దుతున్నాను. కాదు. ముత్యాల్లా పేర్చిన అక్షరాలు చూస్తున్నాను. భావాలు ఆవేశ పూరితాలు. విషయాల్ని చక్కగా సేకరించి, 'మాలకరి మందారాలు మాలలుగా కూర్చి'నట్టే వ్రాస్తాడు.

'సార్,' ఆ గొంతు ఎల్లన్నదే.

'రా. రా. నీ పుస్తకమే దిద్దుతున్నా.'

'సార్. పుస్తకమయితే దిద్దగలరేమో గాని నా జీవితాన్ని దిద్దుతారా?'

వయసుకి మించిన భావాలు వాడు వెలువరిస్తాడని తెలిసిన నేను ఆశ్చర్యపడలేదు.





కాని ఆ వాక్యాన్నే మనన చేసుకుంటూ వాడివైపు చూశా.

చురుగ్గా వెలిగే కళ్లల్లో చిరువేదన రెప్పల్ని తడుపుతోంది.

నా టేబిల్‌వైపు వస్తున్నాడు.

వణుకుతో అతి తేలిగ్గా వేసే అడుగుల్లో తడబాటు తొణుకుతోంది.

అర్థంకాని సందిగ్ధం ముందువెనుకలకి వూపుతున్నట్టు తల వణుకుతోంది.




'సార్. టీ. సి. ఇప్పించండి. మా వూరు వెళ్ళిపోతాను.'

మృదువైన బరువుతో పలికే స్వరంలో మెదిలే ఆక్రోశం.

స్కూల్లో చేరిన మొదటి రెండు మూణ్ణెల్లో బెంగతో కొందరు పిల్లలు ఇంటికి పోతామనడం ఎరుగుదును. అయిదేళ్ళనించీ శ్రద్ధగా చదివే స్కూలు ఫస్టువచ్చే స్టూడెంట్ ఇలా అంటుంటే-

'అదేం పట్టుమని రెణ్ణెల్లయినా లేదు పల్లెకెళ్ళి. ఇంతలో ఏంతంగాలొచ్చింది? మతిగాని పోయిందా?'

'పోయినా బాగుణ్ణు సార్. ఆ చెడు మాటలు వినేకంటే '

'ఏవిటా చెడు మాటలు?'

'... ... '

'ఎవరన్నారు?'

'రమాకాంతం, రంగనాథం వాళ్ళు సార్.'

'ఎప్పట్నించి?'

'వారం రోజుల క్రితం ఎమ్.వో. వచ్చినప్పట్నించి.'

'డబ్బు గురించి అడిగారా?'

'కాదు సార్. ఆ డబ్బు పంపే సుబ్బారెడ్డిగారు.. మా అమ్మని ' చెప్పలేక గోడవైపు ముఖం తిప్పుకుని సన్నంగా గీకుతూ ఏడుస్తున్నాడు.

నా కర్థమైంది. ఇంక వాడిచేత ఆ మాట అనిపించడ మెందుకు? లేచి వెళ్ళి వాడి బుజంమీద తట్టుతూ 'వూ, వాళ్ళ నిన్నేం అనకుండా చేసే పూచీ నాది. ఈ విషయాలు మర్చిపోయి శ్రద్ధగా చదువుకో' అనునయించాను.

కళ్ళు తుడుచుకుంటూ పోయాడు.

క్రమశిక్షణకీ, విద్యాబోధనకీ, ఉన్నత ప్రమాణాలకీ పేరు గడించిన గుడిలాంటి బడిలో ఈ విపరీతమా?

కుతంత్రాలూ, కుళ్ళూ, రాజకీయాలూ, రచ్చబండలూ లేని చోట ఈ అపశ్రుతులా?

చదువు తప్ప చవకబారు పనులకీ, చవటతనాలకీ సమ్మెలకీ, సావాసాలకీ తావివ్వని పవిత్ర స్థలంలో ఈ పాపాల నీడల జాడలా?

ఎల్లన్న తెలివితేటల్ని చూసి రమాకాంతం ఏడిపిస్తున్నాడా? కులద్వేషమా?

ఎల్లన్న రాతని మెచ్చుకొన్న నేను వాడి తలరాతని గురించి ఆలోచిస్తున్నా.

క్లాసులో వుండగా ఈ సంగతి ఎత్తితే అనవసర ప్రాధాన్యం, ప్రచారం ఇచ్చినట్టవుతుంది.

కొందరి కళ్ళల్లో విస్తరించే భయంకరమైన జాలి, కొందరి పెదవుల్లో మెలితిరిగే దారుణ అవహేళనతో ప్రవర్తిస్తున్న ఎల్లన్నకున్న పరిధిని మరీ కుచింపజేస్తుంది.

అందుకే మిగిలిన టీచర్స్ క్లాసుల నించి రాకముందే తేల్చెయ్యాలి.

రమాకాంతాన్ని, రంగనాథాన్ని మరో నలుగుర్ని రప్పించాను. మూణ్ణిమిషాలు వాళ్ల ముఖాల్ని నిశ్శబ్దంగా పరిశీలించాను. రమకాంతం తప్ప మిగిలినవాళ్లు బెదురుతూ తలలు వంచారు.

'ఎల్లన్నని ఎందుకలా హింసిస్తున్నారు? ఈ బడిలో అశాంతిని రేపే అల్లర్లు లేపదీసే హక్కు మీ కెక్కడిది? తోటి సోదరుణ్ణి తొచినట్టు తూలనాడడం సబబా? వాడు మీలాంటివాడు కాదా? ఏవిటి మీ వుద్దేశ్యం?'

జవాబు లేదు.

రమాకాంతం ముందు నిల్చున్నాను. కొంచెం జంకాడు.

'చెప్తావా లేదా?'

'వాడేం సోదరుడు కాడండి.'

'వూ?'




'కులం తక్కువోడు మాతో ఎలా సమానం?'

'ఆఁ!'

'మేం విన్నమాట అన్నానండి.'

'ఏఁవిటి నువ్వన్నది? ఎక్కడ!'

'మా అక్క అత్తవారూరు ఎల్లన్న వూరేనండి. మొన్న సెలవుల్లో వెళ్లినపుడు చాలాను ది చెప్పారు.'

నాలో ఆవేశాన్ని రాజుకుంటోంది.

వివేకమేఘం కారాడుతోంది.

'ఒరేయ్ కిట్టవివాళ్లేదో అన్నారేమో, మీ కనవసరం. వాడి జోలికి పోవాల్సిన పని లేదు. కులం కాదు ముఖ్యం. గుణం. మన పరువు నిలబెట్టే స్టూడెంట్ వాడే. వాణ్ణి అల్లరిపెట్టనని నాకు మాటివ్వండి.

స్థిరంగా అన్నాను.

'అం. రైటింగ్ బాగా వచ్చుని గీర. నా నోట్సు రాసిపెట్టలేదు. బొమ్మలు గియ్యడం బాగా నేర్చాడని పొగరు. రికార్డుల్లో ఒక్క బొమ్మ వెయ్యలేదు. ఎప్పుడూ మాతో కలవడు సోదరు డెలా అవుతాడు మేం చెప్పినట్టు చేసిపెట్ట మని వాడికి మీరే చెప్పండి.' అతి తెలివిగా మాట్లాడా న్నట్టు ప్రక్కవాళ్ళవైపు తిరిగాడు.

'తన చదువు మానుకుని సీకెలా సాయపడతాడు. ఇటీజ్ ఇంపాజిబుల్..'

'హూఁ మాకూ ఇంపాజిబులే'

వూహించని తిరుగుబాటు. నా సహనమే వాడికా అవకాశం ఇచ్చింది. వూరుకుంటే లాభం లేదు. అంతే.

ఛెళ్, ఛెళ్, ఛెళ్, ఛెళ్

ఆయాసంతో ఆగి చూశాను. రమాకాంతం చెంపలపై ఎర్రగా కందినంత మేర నా వేళ్ల గుర్తులు.

వాడి ఆస్తి- పెద్ద పొగరు నచ్చింది. వారసత్వం ఇతరులమీద జులుం చేయిస్తోంది. కులం- అహంకారాన్ని, అక్రమాధికారాన్ని ఇచ్చింది.

ఇంటర్వెల్ అవటంతో కిటికీల కెదురుగ, గుమ్మంముందూ పిల్లలు చోద్యం చూస్తున్నారు.

వాళ్ళముందు తనకు పడిన శిక్ష కవమానపడి రోషం హెచ్చి, 'ఎల్లన్నని చూసినట్టు మీరు మమ్మల్ని చూస్తున్నారా? మీ యిష్టంవచ్చినట్టు కొడతారా?' నిర్లక్ష్యంగా తల ఎగరేశాడు.

వాడి గొంతులో పౌరుషం, ఉక్రోషం దురభిమానం.

ఆ ఎదిరింపు నా కోపాన్ని రెట్టించింది

వంగదీసి ధనాధనా బాదుతుంటే తూలి, గోడకొట్టుకొని 'అమ్మా' అంటూ కూలబడ్డాడు.

ఆ అరుపుకి నాలో వివేకం మేల్కొంది.

ఎరుపెక్కిన్న కళ్లతో అటు తిరిగేసరికి మిగిలినవాళ్లు వొణికిపోతూ 'క్షమించండి సార్. ఎల్లన్న జోలికి వెళ్లం' అన్నారు.

నాలోని విపరీత సంచలనానికి విస్తుపోతూ, నా కోపానికి సిగ్గుపడుతూ నీరసంగా కుర్చీలో కూర్చుని వెనక్కి చేరగిలబడ్డాను.

ప్రిన్సిపాల్‌గారు రమాకాంతాన్ని పిలిపించి, చివాట్లు పెట్టి నాకు క్షమార్పణ చెప్పుకోమని పంపించారు కాబోలు, పొరపాటు మన్నించమని అడుగుతుంటే వాచిన వాడి బుగ్గల్ని చూసి చలించిపోయాను.

'సారీ ఫర్ మై క్రూయల్టీ' అనకుండా ఉండలేకపోయాను.

ఈ సంఘటనలో ఎల్లన్నకి మనశ్శాంతి కలిగిందనుకున్నా కానీ- వాడి మనస్సులో నాటుకున్న విషబీజం మొల



కీర్తి, పెరిగి, వేళ్లూని ప్రకమాతోందని, మానసికంగా ది జారిపోయాడని క్లాసు పరీక్షల్లో తగ్గిన మార్కులే రుజువు చేశాయి.

వాడి నిర్లిప్తత, నిరాసక్తి నన్ను తినేస్తున్నాయి.

అవి తొలగిపోయే మందు వెయ్యాలి, ఎలా ?

పబ్లిక్కింక నెల్లాళ్లే వుంది.

స్కూలు పరువు ప్రతిష్ఠలు, మా ప్రతిభకి గుర్తింపు వాడి భవిష్యత్తు ఫలితాల మీద, వాడు చూపించే శ్రద్ధమీద ఆధారపడి వున్నాయి.

బళ్లో చేరినప్పుడు వాడివెంట వచ్చిన నా మిత్రుడికిచ్చినమాట, ఏడాదికోసారి వచ్చి కొడుకుని చూసుకొని వాడి బాధ్యత నా కప్పగించిన వాడి తల్లి రమణమ్మ అభ్యర్థనా నా శ్రద్ధకి కారణాలు.

నాలోని అనుమానాలకి, ఆరాటాలకి జవాబుగా ఓనాటి సాయంత్రం రమణమ్మ స్వయంగా వొచ్చింది.

నిండుగా కప్పుకొని, నిరాడంబరంగా గంభీరంగా హుందాగా వున్న ఆమెని చూడగానే సదభిప్రాయం కలుగుతుంది.

'బావున్నావా అమ్మా' అని పలకరించగానే కొద్దిగా అవుననన్నట్టు తల వూపుతూ 'నా బిడ్డని నాకు దక్కించండి బాబుగారూ-' అంటూ సన్నగా విలపిస్తోంది.

'ఏడవకమ్మా వాణ్ణి నేను జాగ్రత్తగా చూస్తాగా'. ఓదారుస్తున్న నా దగ్గరికి మెల్లగా వచ్చి, ఓ ఇన్లాండు కవరిచ్చింది.

ఆమె కళ్లు కన్నీటిని కురిపిస్తున్నాయి.

కవరు తెరచి చూశాను. ముత్యాల్లాంటి అవే అక్షరాలు అమ్మా అని రెండుసార్లు రాసి కొట్టివేయబడింది.

'నిన్నెందుకో అలా పిలవాలనిపించటంలేదు. నా తల్లి అరుంధతి, సుకన్య, సుమతి అనసూయల వంటి పతివ్రత అనుకున్నాను కాని నువ్వింత

కులటవని నా మిత్రులవల్ల ఇపుడే తెలిసింది. దేవుడిలాంటి భర్త పోయాక పరాయి మొగాడితో కులికే నిన్ను తల్లిగా భావించలేను. నువ్వెప్పుడూ నా దగ్గరికి రాకు. వస్తే ఛస్తాను. నన్ను మర్చిపో. నీకు కొడుగ్గా పుట్టినందుకు జీవితాంతం కుమిలిపోయే దౌర్భాగ్యుడు— ఎల్లన్న'

ఆవేదనని అక్షరాల్లో పొదిగి, తన గుండెల్లో గుచ్చుకున్న గాలాన్ని లాక్కోలేక, దాని వంపు కలుక్కుమంటుంటే, నలిగి నలిగి, మనసు విరిగి విరిగి, బ్రతుకు బరువు బరువై నా అనే దిక్కు కరువు కరువై, తల్లడిల్లే వాడి గొంతు ప్రతిధ్వనిస్తోంది— లేఖలో.

స్వసుఖం, స్వార్థం చూసుకుంటోందని ఈమెని చీదరించినా? ప్రాణం లాంటి కొడుకి— దూరమౌతోన్న నిస్సహాయురాలని ఆదరించనా?

అంత తెలివైన కొడుకుని కన్నదని అభినందించనా? వాడి బంగారు భవిష్యత్తుకి చిచ్చుపెట్టిందని అభిశంసించనా?

సంఘర్షణ పడుతూ—

'లోకాన్ని తెలుసుకుంటున్న ఎదిగిన బిడ్డకి తల్లివైయుండీ నీ సుఖం కోసం వాడి బంగారు భవిష్యత్తుని బలిపెట్టే. నీకు ఈ ప్రమాదం ఎప్పటికైనా వచ్చేదే. నిన్ను ముంచెత్తేదే.'

శూన్యంలోకి చూస్తూ నా నిరసన బావని వెళ్లగక్కాను.

'బాబూ నే చెప్పేది విని నా తప్పెంతో, ఏవిటో ఆలోచించండి.

'మా మావ వెంకట్రావుతో నా పదమూడో ఏట పెళ్లయింది. మరో ఏడాదికి కాపరాని కెళ్లాను. ఎలక్ట్రిసిటీలో హెల్పరుగా చేసేవోడు. తిరుపతికి పదేను మైళ్లలో పూరుమూల పల్లె మాది వయసుకు మించి ఎదిగిన నన్ను, నా అందాన్ని సూసి మురిసిపోయి కూలిపనికి కూడ ఎల్లనిచ్చేవోడు కాదు. ఎల్లిగాడు పుట్టాక ఆడు అమ్మనాపోలికేనని గుడిసెలో వున్నంతసేపు బుజం దింపేవోడు కాదు. ఆణ్ణి ఎంజనీర్ని సెయ్యాలని రెక్కలు ముక్కలు సేసుకుని పన్జేసేవోడు వొచ్చిన డబ్బంతా 'సుబ్బారెడ్డి' కాడ దాసేవోడు. సంకటిముద్ద పచ్చిమిరపగాయి తినేవోడు. ఎవరేపని జెప్పినా సేసేవోడు. నాలుగేళ్లొచ్చాక ఎల్లిగాణ్ణి సుబ్బారెడ్డి పిల్లల్తోబాటు తిరపతి కాన్వెంటులో చేర్పిచ్చాడు. డబ్బెలాగ కడతావు మావా అంటే రెడ్డి దేవుడనేవోడు.

ఇంట్లో తోచక కూలి కెళతానంటే వొద్దన్నోడే కాని దొర సెప్పాడని సరేనన్నాడు. రెడ్డి పేలల్లో పని. దొర సూపుల్నించి తప్పుకోడానికి నరకయాతనయ్యేది. మావకి రేత్రీపొగలూ లేకుండా కబురంపేవోడు. కరెంటు పోయిందని, మోటారాగిపోయిందని ఏదో వొంక, ఆడు బతికుండగా లొంగనను కున్నాడు కావోసు.

ఓటూరి పెద్ద వోనకి కరెంటు తీగలు

తెగిపోయినాయి. తంబ(వెక్కి తీగలు బిగిస్తావుంటే ఏ సచ్చినోడు కరెంటు వొదిలాడో మావ షాక్కొట్టి సచ్చిపోయాడు '

కొంగు నోటి కడ్డంపెట్టుకొని రోదిస్తోంది రవణమ్మ.

తేరుకుంది.

'అప్పటికే తల్లి తోడూ ఎవరూ లేక, బంధువులు రాక నలిగిపోతావుంటే రెడ్డి వూరొదిలి పోవద్దని, ఉండిపొమ్మన్నాడు. మరో పెళ్లి చేసుకుందారంటే తాకట్టోతులు కొందరు, కాలిచేసి తెచ్చిన దుడ్డిమ్మని కుమ్మిక్కుమ్మి వొదిలేవోళ్లు కొందరు, ఉన్నోళ్లకి తీర్చి యాపారం చేసే యెదవలు కొందరు. నమ్మలేక పోయాను.

రెడ్డి పొలంలో ఎనక్కి పిలిపించి తనని నమ్ముకుంటే బిడ్డనీ నన్నూ ఏ లోటూ రాకుండా చూస్తానన్నాడు. ఇనక పోతే షాకొట్టి సస్తావన్నాడు. అలాగే సద్దారనుకున్నా. కాని బాబూ నా బిడ్డ కోసవే ఆ బురదలో కూరుకుపోయాను. అదే లేకపోతే నా మావతోటే సచ్చుండును '

నా కళ్లు చెమ్మగిల్లాయి అప్రయత్నంగా.

'అబద్దం సార్. నమ్మకండి. నా మీద నిజంగా అంత ప్రేమంటే చచ్చిపొమ్మనండి. నా కది అమ్మేకాదు. ఆ రోజే చంపేసున్నా నాకీ బాదుండక పోను ' అంటూ పరుగెత్తుకుపోయాడు ఎల్లన్న.

వాడు రావడం, తల్లి చెప్పింది వినడం మేం గమనించనేలేదు. అప్పటికే అనుమానం పెనుభూతంలా బాధపడుతున్న వాడికి అవునని సాక్ష్యం చెప్పినట్లయింది.

వాడేం అఘాయిత్యం చేస్తాడోననే భయంతో వెంటబడ్డాను.

స్కూల్లో ఎక్కడో చెట్టుకింద చీకట్లో కూర్చుని ఏడుస్తున్నాడు

ఆ పొంగు అణిగేదాకా ఆగాను. ఆ లోపున ఉపాయా లాలోచిస్తున్నాను.

ఓ నిర్ణయానికి వొచ్చేశాను.

'వొరేయ్ ఎల్లన్నా, నువ్వు మీ అమ్మ ముఖం చూడకు. అలాంటి దుర్మార్గురాల్ని దూరంగా వుంచడమే మంచిది నువ్వన్నట్టు అబద్ధం చెప్తోంది ఇక్కడికింక రావద్దని గట్టిగా చెప్పేస్తాను. నిన్ను నేను చదివిస్తాను ఉద్యోగం వచ్చాక బాకీ తీర్చుదుగాని. సరేనా ?'

వింటూనే నా కాళ్లకి మొక్కి 'మీ మేలు ఎన్నటికీ మర్చిపోను సార్. మీరు చెప్పినట్టు చేస్తా' నన్నాడు.

వాణ్ణి హాస్టల్లోకి పంపి నైట్ వాచ్మన్తో ఓ కంట కనిపెట్టుకోమని హెచ్చరించి, ఇంటికి వెళ్లాను.

మా శ్రీమతి బలవంతమ్మీద రవణమ్మ వో రెండు మెతుకులు తిందట.

చాపమీద కొంగు పరుచుకుని నిస్సత్తువగా సోలిపోయింది.

ఆమె విలాసవతి అయ్యుంటే ఆమె మాటల్లో, చేతల్లో మమకారం అలా ఉట్టి పడదు. ఆమె వేషంలో భాషలో, అసహజత్వం లేదు

పద్దెనిమిదో యేట పెనిమిటి పోతే ఆ నిండుజీవితం గడిచేదెలా?

తల్లీ, తండ్రీ, డబ్బూ, హోదా, రక్షణ అన్నీ ఉన్న అమ్మాయిలకే మాన భంగాలు తప్పని ఈ రోజుల్లో-

ఈ జనారణ్యంలోని ఇన్ని క్రూర మృగాల్ని ఒంటరిగా, అనాధగా పోరాడాలంటే ఆమెకంత శక్తి ఏది!

భర్త అసమర్ధుడనీ, దరిద్రం అనీ, కట్నం యివ్వలేక పెళ్లి కాలేదని వంక పెట్టి కొందరు, ఫ్యాషన్‌గా, జల్సాగా, ఒళ్లు బలిసి కోర్కెలు పెరిగి కొందరు లాడ్జి గుల్లో తిరిగే రోజుల్లో కొడుకు నుద్ధరించడానికి ప్రాణంలాంటి శీలాన్నే పణంపెట్టిన ఆమెలో 'మాతృదేవత'ని చూశాను.

అనుకున్న ఏర్పాట్లు చేశాను.

నేను వచ్చిన అలికిడికి లేచిన రమణమ్మకి చేయవలసింది చెప్పాను.

* * *

తెల్లవారిందో లేదో తెలీదు.

'ఏమండోయ్. లేవండి. కొంప మునిగిపోయింది.' శ్రీమతి అరుపులకి మత్తువదలక దుప్పటి మళ్లీ పైకి లాక్కుంటుంటే 'రమణమ్మ ఏదో మింగిందండి' వసారాలో చచ్చిపడుంది. పోలీసులొస్తే మిమ్మల్ని జైల్లో పారేస్తారండి.' కుదిపేస్తూంది.

ఉలిక్కిపడి లేచాను. వసారాలోకి వచ్చి చూసేసరికి నిశ్చలంగా చాప మీద పడున్న రమణమ్మ చేతిలోంచి జారి దొర్లిపడిన నిద్రమాత్రల సీసా.

శ్రీమతి పెడబొబ్బలకి మూగిన దారిన పోయే జనం.

తలొకరు తలో మాట.

'అయ్యో. అయ్యో. ఇదెక్కడి సంత. ఈ ఖర్మంతా మా నెత్తిమీద కొచ్చిపడింది.' శ్రీమతి ఆందోళన, అలజడి.

ఎల్లన్నకి కబురు వెళ్లింది.

డాక్టర్ని తీసుకొచ్చేసరికి, గుండె లవిసేలాగ తల్లిమీదపడి ఏడుస్తున్నాడు వాడు.

'నాడి'ని చూసి డాక్టరు 'గుండె నీరసంగా కొట్టుకుంటోంది. ఓ అరగంటలో ఈ మందు తెస్తే బతికే అవకాశముంది' అంటూ కాయితమ్మీద రాసిచ్చాడు.

అది తీసుకుని టౌనుకు వెళ్లి మందు కొని అరగంటలో తిరిగొచ్చాడు స్కూటర్ మీద.

డాక్టర్ ఇంజక్షన్ చిచ్చాడు.

మరో గంటకి రమణమ్మకి స్పృహ వచ్చింది.

'నన్ను బతికించొద్దు. చంపెయ్యండి నా కొడుక్కి నే నక్కరలేకపోయాక ఎవరికోసం బతకాలి. వాడే నన్ను మానించాక, ఛీ అన్నాక ' ఆమె మాటల్ని పూర్తికానీయకుండా-

'అలా అనకమ్మా. నాది పొరపాటే. ఇంకెప్పుడు నిన్నేం అనను. బాగా చదువుకుంటానమ్మా' ప్రతిమాలుతున్నాడు ఎల్లన్న.

'నీ కొడుకుని వొదిలి ఎక్కడికీ పోకు. ఆ కూలిపని ఏదో ఇక్కడే చూసుకో. ప్రిన్సిపాలుగారితో చెప్పి ఏర్పాటు చేయిస్తాను.' అని సలహా ఇచ్చాను.

రమణమ్మ కృతజ్ఞతతో మ్రొక్కింది.

ఆ సాయంత్రమే స్కూల్లో స్టోర్ రూమ్ ప్రక్కనే చిన్నగది ఇప్పించాను. కావాల్సిన సామాను తెప్పించాను.

రాత్రి పడుకోబోతుంటే శ్రీమతి తమలపాకులు తెచ్చి ఇస్తూ, 'ఏమండీ తెలీకడుగుతాను. అన్ని నిద్ర మాత్రలు మింగింది గదా. ఒక్క ఇంజక్షన్‌తోనే ఎలా లేచింది? విచిత్రమే సుమండీ' ఇంతలేసి కళ్లు మరింతింత చేస్తూ బుగ్గలు నొక్కుకుంటోంది.

'మింగింది పిప్పరమెంట్లు. మిగిల్నవి నిద్రమాత్రలు ' అన్నాడు తాపీగా.

'హుసినీ ఎంత జాణ. ఇన్ని టెక్కులు నేర్చింది ' చదవబోయే దండకం ఆపించి, 'ఆ ఉపాయం చెప్పింది నేనే. డాక్టరుకీ, ఆమెకీ తెలుసు. కడుపు తీపి అలా చేయించింది. పిల్లాకి చాలా అమాయకురాలు.'

'మీలోని రచయిత నీతులు కాగితాలకే పరిమితం అనుకున్నా. జీవితాల్ని దిద్దేందుకే ఆచరించి చూపిస్తారనుకోలేదు సుమీ' మెచ్చుకుంటూ లైటు ఆర్పేసింది.

నా శ్రమ ఫలించింది.

పబ్లిక్ పరీక్షలో ఎల్లన్న స్టేట్ ఫస్టు వచ్చాడు.

ఆ విజయం వెనకాల నా కృషిని ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపాలుగారు మెచ్చుకుంటుంటే, సహ ఉపాధ్యాయుల ప్రశంసల నడుమ నన్ను సమ్మానిస్తుంటే నాలో సంతోషసాగరా లుప్పొంగాయి.

ఎల్లన్న తన మనస్సులో అత్యున్నత స్థానాన నన్ను నిలుపుకుంటున్నానని వేదికపై ఉపన్యసించి నాకు మ్రొక్కుతుంటే ఆనంద బాష్పాలతో నా కళ్లు చెమ్మగిల్లాయి.

నా వృత్తిమీద గౌరవం, అభిమానం సంతృప్తి నిండుగా వెల్లివిరిశాయి.

— — —